# 15. మదపిచ్చి

విసుగుచెందని విక్రమార్కుడు మర్రిచెట్టెక్కి శవాన్ని భుజాన వేసుకొని, దిగి, మెల్లిగా నడక సాగించాడు.

శవాన్ని ఆవహించిన వీర్య భేతాళుడు ఇలా అన్నాడు:

"రాజా! ప్రతిజీవీ సుఖంకోసం నానా అగచాట్లూ పడుతూండటం సహజమే! ఆ సుఖాన్ని పొందుతూన్నప్పుడు, ముందున్న కష్టకాలాన్ని గూర్చిన ఊహే రాదు. ఈ పొందిన సౌఖ్యాలకు ఏదో ఒకనాడు. తగిన జరిమానా చెల్లించవలసి వొచ్చినప్పుడు గాని, తాను పొందిన సౌఖ్యానికి విలువ తెలిసిరాదు... ఈ అపరాధాలు చెల్లించకుండా బైటపడదామనీ, తమ నేరాలకు శిక్ష పడకుండా తప్పించుకుందామనీ ప్రతివారూ ప్రయత్నిస్తూనే ఉంటారు. చేసిన పాపాన్ని క్షాళితం చేసే నిమిత్తం అనేక పుణ్యకార్యాలు కూడా చేస్తారు. మహదాశయాలను సాధించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఐతే తుదినిర్ణయం ఒక్కటే వారి యోగ్యతను నిర్ణయిస్తుంది. అదెలా ఉండగలదో మనం చెప్పలేము... నీ వీ ఘనకార్యాన్ని ఎందుకు నెత్తి కెత్తుకున్నావో నాకు తెలియదు; నీ మహదాశయ మేమిటో కూడా నేను ఎరగను. ఐతే తుదినిర్ణయం దుఃఖహేతు వవొచ్చు.... నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకు ఒకా నొక శృంగార పురుషుని గాథ చెపుతాను– విను."

వీర్య భేతాళుడు చెప్పిన కథ ఇది:

బ్రహ్మదేవుడు కూడా అడపా దడపా పెద్ద పొరపాటు చేస్తూంటాడని రుజూ చేయదలచిన వారు మదనమోహన్‌ని ఎత్తి చూపి, తమ వాదాన్ని నిరభ్యంతరంగా నెగ్గించుకుంటారు.

మానవ జీవితానికి అనుకూలమైన వాటినీ, ప్రతికూలమైన వాటినీ కలేసి ప్రసాదించటంలో బ్రహ్మ పేరు పడినవాడు. అలాటి వాడు ఏ ఏమరుపాటునో మదనమోహన్‌కు ఎంతో అనుకూలమైన వాటిని విశేషంగా ప్రసాదించటం జరిగింది.

మదనమోహన్ బొడ్డులో బంగారంతో పెద్ద జమీందారి ఇంట ఏకైక పుత్రుడుగా జన్మించాడు. బిడ్డగా ఉన్నప్పుడే చాలా అందగా డనేవారు. పెరిగి పెద్దయ్యాక, నవమన్మథుడే అనక తప్పలేదు. అందానికి తగినట్లుగా అద్భుతమైన ఆరోగ్యం అతనిది. చిర్రున చీది ఎరగడు. ఆ శారీరక యంత్రాంగం ఎలాటి లోపమూ లేక, అలసట నెరుగని విధంగా పనులను ఎలా నిర్వహించగలదో గమనించిన వారికి ఆశ్చర్యం ఎదురవక తప్పదు.

ఎటొచ్చీ చదువు వొక్కటే అతనికి బాగా అంటలేదు. ఐతే ఆ కొద్ది చదువుకూ నాగరికతా, సంస్కారమూ అలవరుచుకున్నందువల్ల, విద్యాధికునివలెనే ప్రవర్తించగలిగే వా డతను.

ఈ ప్రపంచంలో 'ధనం' అత్యధిక భాగాన్ని కొనగలదు. ఎలాటి లోపాలున్నా వాటిని అవలీలగా అది పూడ్చగలదు. అది ప్రపంచంలోని అన్ని భాషలనూ ధారళంగా మాట్లాడటమే గాక, కొండమీది కోతిని సైతం నేలమీదికి దించగలదు. ఇక ఆ ధనం రాసులు రాసులుగా ఉన్నవాడికి దిగు లేమిటి?

తాను శ్రమపడి సంపాయించవలసిన పనిలేదు. ఏటా నాలుగు లక్షలరూపాయల ఆదాయమున్న జమీకి మదన మోహన్ అధిపతి. అతని తండ్రి చాలా జాగర్తగా ఖర్చుపెట్టే వ్యక్తి కావటంవల్లా, వ్యసనాలపాలు అవని కారణానా– నలభై లక్షల రొఖ్ఖాన్ని ఇండియాలోని బాంకుల్లోనే గాక– పరదేశాల బాంకుల్లో కూడా నిలవజేశాడు.

బెల్లమున్న చోటికి చీమలు వాటంతటవే కుప్ప తిప్పలుగా గుమికూడుతవి. మదనమోహన్ చుట్టూ నానారకాల స్నేహితులూ జేరేందుకు ఎక్కువ కాలం పట్టలేదు.

ఒక వ్యక్తిని – అందునా ధనవంతుణ్ణి తమ చెప్పుచేతుల్లోకి కాకపోయినా, తమ పలుకుబడిలోకి తీసుకునేందుకు అతన్ని ఎరిగిన వాళ్ళందరూ విశ్వప్రయత్నాలు చేశారు. స్నేహంలో పొందదగినవే కాకుండా, సాధారణంగా అడగరానివీ, కోరరాని వాటిని కూడా సాధించేందుకే యీ మిత్రుల ఆరాటం.

వారి పలుకుబడికి మదనమోహన్ లొంగుతాడనే ప్రశ్న ఎవర్నీ బాధించలేదు. ఐతే దేనికి అతను వశ్యుడౌతాడనేది ముఖ్యం. ఆ 'దేనికి?' అనే దానిమీద ఆధారపడి అతన్ని సాధించవొచ్చనే విషయమే ప్రాధాన్యత వహించింది.

ఇలాటి వ్యవహారంలో ఏ వ్యక్తిని వశం చేసుకోవాలో ఆ వ్యక్తిలోని శక్తివంతమైన గుణాలు ప్రత్యర్థికి ప్రతికూలమైనవీ; లోపాలూ, బలహీనతలూ సానుకూలమైనవీ అనే సిద్ధాంతం ప్రపంచాదిగా ప్రతి సందర్భంలోనూ రుజూ అవుతూనే ఉన్నది.

ఇక యీ బలహీనతల మాటకొస్తే సర్వసాధారణంగా సహజ వాంఛలూ, ప్రకృతి సిద్ధమైన శాసనాలకు లొంగనివారు నూటికి కోటికి ఒక రుంటారేమో? కనుక ప్రకృతే దారి చేసి పెట్టిన బాటను పడితే నల్లేరు మీది బండి నడకగా రూపొందుతుందనే స్వల్ప విషయం సామాన్యులకే కొట్టిన పిండి!

సహజవాంఛల్లో ముఖ్యమైనవీ- ప్రపంచంలోని అన్ని సమస్యలూ స్థూలంగా విభజనలోకి ఇమిడేవి రెండే రెండు; ఒకటి ఆకలి; రెండు: సెక్స్. వీటని గూర్చి ఎవ్వరూ నేర్పవలసిన పనేలేదు. వాటంతటవే ప్రతి వ్యక్తినీ లొంగదీసుకొని, రెండు వాంఛలూ తీరే సావకాశాలకోసం అన్వేషింప జేస్తవి. ఆదిమ మానవుని దగ్గర్నుంచీ, ఆధునిక మానవుని వరకూ యీ రెండు ముఖ్య సమస్యలూ రూపాలు మారినా, గుణాలు మార్చుకోలేదు.

వీటిల్లో మొదటిదైన 'ఆకలి' ప్రమేయం మదనమోహన్‌కి లేదు. కనుక దాన్ని అతనిమీద ప్రయోగించటం వ్యర్థం. ఆ మాటకొస్తే అతని దయాధర్మాలకు పాత్రతను సంపాయించుకునే ప్రయత్నాలు చేసేవారికే ఆ 'ఆకలి' ముఖ్య సమస్య.

పోతే ఇక రెండోదిగా మిగిలిన మార్గమే రాజబాట! యీ సమస్యను కూడా మదనమోహన్ తనంతట తానే అతి సూక్ష్మ మార్గాల్లో తీర్చుకోగలడు. ఐతే సహజవాంఛకు తోడుగా కృత్రిమ వాతావరణం కూడా కల్పించటంవల్ల సమస్యా స్వరూపం విశ్వరూపాన్ని దాల్చి, అతన్ని భూమిమీద నిలవనీయకుండా చేస్తుందనీ, అతను ఎంత ఆత్రపడితే తమకు అదంత సానుకూలంగా ఉంటుందనీ మిత్రబృందపు అంచనాలు.

తదనుగుణంగా అతని స్నేహితులు మదనమోహన్ నూనూగు మీసాలు మొలవబొయ్యే సమయానికే 'దాడులు' ప్రారంభించారు. సృష్టి రహస్యమైన లైంగిక విజ్ఞానాన్ని గూర్చి తెలుసుకోవాలనే తహతహ మదనమోహన్‌లో ప్రజ్వరిల్లింది. అంతకన్న ఆ దివ్యానుభూతిని వెనువెంటనే పొందాలనే తీవ్రవాంఛ అతన్ని దహించి వేసింది.

ఇలాటి మంచి తరుణంకోసం చాలామంది ఎంతో ఓర్పుతో వేచి ఉన్నారు. పిల్ల జమీందారును ముందుగా తామే చేజిక్కించుకోవాలని అందరూ తహతహ లాడారు. ముఖ్యంగా జమీందారుగారింట్లో పనిచేసే దాసీల తాలూకు యీడు వొచ్చిన కూతుళ్ళు, తమతమ తల్లుల ఆదేశానుసారం పిల్ల జమీందారు పొందుకోసం వాన చినుకుల కోసం ఎదురు తెన్నులు చూసే ముత్తెపు చిప్పల వలె కాచి ఉన్నారు. అందునా మదనమోహన్ రూపు రేఖా విలాసాలను తిరస్కరించగల మనోధైర్యం ఉన్న మగువలు లే రనటం అతిశయోక్తి అవుతుందేమో కాని, నిగ్రహించగల వారిని మాత్రం వేళ్ళమీద లెక్కించ వొచ్చనటం సమంజసమే అవగలదు.

కావలసినంత వాంఛా, తగినన్ని అవకాశాలూ, అధికారమూ, అడ్డుచెప్పేవారు లేరు సరికదా, ప్రోత్సహించేవారు అత్యధికంగా ఉండటం- మొదలైన అనేక కారణాలవల్ల, సామాన్యులకు అరుదుగా లభ్యమయే కన్యాసంయోగం మదన మోహన్‌కు ఎంతో తేలిగ్గా సమకూరింది.

చిత్రమేమిటంటే- ఆ మొదటి అనుభవంలోనే మదన మోహన్ దశాబ్దపు అనుభవాన్ని ప్రదర్శించగలిగాడు. నిజానికి ఆ అనుభవాన్ని మనసా, వాచా కోరిన ఆ కన్య అతన్ని భరించలేక, ప్రణయఫలం సగం దక్కేప్పటికే పారిపోయింది. దాంతో మదనమోహన్ అహం ఆకాశ మెత్తున లేచింది. తన కామవాంఛ తీవ్రతను తట్టుకొని నిలబడగలిగిన తరుణి ఉండ గలదా అనే సందేహం అతనికి కలిగింది.

అనుమానం కన్న పెద్దరోగం మరెక్కడ ఉంటుందీ? అదీ గాక ఆకలి తీరని భోజనం కలిగించే అసంతృప్తీ, చిరాకుల్లాటివి రెండో అనుభవంలో కూడా ఎదురవుతవనే భయం పట్టుకుం దతన్ని. అందుకని యీసారి వెధవ 'రిస్క్' చేసేందుకు సమ్మతించక, ఒకేసారి ఇద్దరు కన్యల్ని పిలిపించుకున్నాడు.

సమయం ఆసన్నమయే వరకూ, ఏ మానవునికీ తన శక్తి సామర్థ్యాలు తెలిసిరావు. ఈ కొత్త ప్రయోగంలో కూడా అతనిదే పై చేయి ఐంది. ఎంతో అవస్థపడితేనే కాని ఈ కన్యలిద్దరూ కలిసి అతన్ని సమర్థించలేక పోయారు!

ఇకనుంచీ కనీసం ఇద్దరు యువతులన్నా లేనిదే కామవాంఛలు తృప్తికరంగా తీరి, రాత్రి ప్రశాంతంగా గడవదనే సిద్ధాంతాన్ని మదనమోహన్ అమలు జరిపేందుకు నిశ్చయించుకున్నాడు.

సింహం వేటకు బయలుదేరుతే అల్లంత దూరాన నక్క సింహాన్ని వెంబడిస్తుంది; సింహం వేటాడి చంపిన మృగాన్ని అది తినగా మిగిలిం దేమన్నా తనకు దక్కుతుం దేమోనని నక్క ఆశ! అదే విధంగా మదనమోహన్ మిత్రులు కూడా అతన్ని వెన్నాడి చూశారు కాని, వొచ్చే ఇద్దరు యువతుల్లోనూ కామాగ్ని మిగల్చకుంటే మానె- అలసటతో స్పృహ తప్పించే పర్యంతం అతను పిండుకోగా మిగిలిన నిస్సారమైన తిత్తి ఎందుకూ కొర గాదనే విషయం త్వరలోనే ఆ స్నేహితులకు బోధపడింది. కాముక వ్యవహారాల్లో మదనమోహన్‌ను అనుసరించటం వృథా అని తేలిపోగా, ఆ మిత్రులు ఆ సమయానికి ఎవరి గూటికి వారు చేరుకొనే ప్రయత్నాల్లో ఉండేవారు. సింహానికే చాలని నారీ మాంసం నక్కదాకా ఎక్కడొస్తుంది?

త్వరలోనే మదనమోహన్ రతి చాతుర్యం ప్రసిద్ధికెక్కింది. ధనవంతుడు తన పురుషత్వాన్ని నలుగురూ గొప్పగా చెప్పుకునేందుకు జనానాను కాకున్నా, నలుగు రైదుగురు ఉంపుడు కత్తెల్ని భరించటం ప్రపంచానికి తెలుసు. ఐతే యీ మదన మోహన్ తాను అనుభవించ గలిగేదే కోరేవాడు; కోరిందాన్ని బీరుపోకుండా

అనుభవించేవాడు. అతని పొందు పొందిన ప్రతి పడతీ, ఒక్కతె కాదు కదా- అతి కష్టంమీద ఇద్దరు స్త్రీలు ఒకరి కొకరు తోడుగా లేనిదే అతన్ని భరించటం అసంభవమనే అభిప్రాయాన్ని ఎలాటి షరాలూ లేకుండా ఒప్పుకోవటం పరిపాటవటంతో, అతని రసికత్వాన్ని సవాల్ చేయగలిగే వారెవ్వరూ లేకుండా పొయ్యారు. అతను సార్థక నాముడని ప్రసిద్ధిజెందాడు.

అతని పూర్వులు గొప్ప యోధులట! వారు కదనరంగంలో చివరి రక్తకణం వరకూ పోరాడే వారట! ఇక మదన కదనంలో యీ మదనమోహన్ చివరి వీర్యకణం వరకూ పోరాడే సాహసని పేరు పడ్డాడు.

అతని తాతగారు మంచి వేటగాడట! ఇతను స్త్రీలను వేటాడటంలో గొప్ప వేటగాడని ప్రసిద్ధి చెందాడు!

తమ కొడుకు చెడుదార్లు తొక్కుతున్నాడని తెలిసినా, ఒక్కగాని ఒక్కడే ఐనందువల్ల అతని తల్లిదండ్రులు అంతగా పట్టించుకోలేదు. ఎంత ఖర్చు పెట్టినా తరగని ఆస్తిపాస్తులున్నందువల్ల మదనమోహన్ జీవితం హాయిగా గడిచిపోతుందని వారు సరిపెట్టుకున్నారు.

త్వరలోనే ఆ ఊరులో అనుభవ యోగ్యమైన అతివలందర్నీ మదనమోహన్ అనుభవించేశాడు. ఈ కామం అతని కో గొప్ప వ్యసనమైంది. ఐతే యువతుల కొరత యీ ప్రపంచంలో ఎన్నటికీ రాకుండా ఉండేందుకై మానవులు ఎడతెరిపి లేకుండా జనాభాను పెంపొందిస్తూనే ఉన్నారు. అందుకని మదనమోహన్ హేలు మకాం మార్చాడు.

ఇటీవల తాగుడుకూడా అలవాటు చేసుకున్నాడు. అదేం చిత్రమో - తాగాక అతనికి ఏనుగు బలం వొచ్చేది- రతిరంగంలో అచంచలమైన పురుషత్వాన్ని ప్రదర్శించ గలిగేవాడు.

'అతను తినే తిండిలో ఉన్న దా శక్తి!' అని కొంద రనుకునేవారు; ఐతే అతని వంటవాడు అదే తిండిని మదనమహన్ కన్న రెండింతలు తిని నేల కరుచుకొని దుంగవలె నిద్రించేవాడు!

'ధనమదాంధత' అని మరికొందరి అభిప్రాయం. ఏ ఇతర ధనవంతునిలోనూ లేని ఆ కామాగ్ని మదనమోహన్‌లోనే ఎందుకు జొరబడిందో సహేతుకంగా చెప్పటం ఎవరికీ కుదరలేదు. ఒక్కో వ్యక్తి ఒక్కో కళలో అందెవేసిన చేయిగా ఉంటాడనే సామ్యాన్ని బట్టి చెప్పవొచ్చంటే- 'కామకళాకౌశలం' లో మదన్‌మోహన్‌ది పెట్టింది పేరనే అనాలి.

'ఈ కామం అతనికో వ్యాధి! దుర్లక్షణం! అసామాన్యమైనది. ఏదైనా సరే వ్యాధిగాక మరేమిటి!' అనేది ఇంకొంత మంది అభిప్రాయం. వీరిలో కామవాంఛలు సాధారణంగా

ఉండవలసిన మోతాదులో లేనివారు అత్యధికులు. అందుకని ఈర్ష్యకారణంగా వీరీ వాదనను లేపారనవొచ్చు.

ఐతే వైద్యశాస్త్రజ్ఞులూ, శరీర శాస్త్రకారులూ, మనస్తత్వవేత్తలూ, పరిశోధకులూ మొదలైన వారికి అసలు కారణం కాదు కదా– దాని ఛాయలు కూడా అంతుబట్టలేదు. అడపాదడపా ప్రకృతి మానవుని ఊహకు అందని విధంగా విచిత్ర వ్యక్తిత్వాలను సృష్టిస్తూంటుందనే వాదనతో వారు సరిపెట్టుకున్నారు.

మదనమోహన్ దర్శించని మహాపట్టణం లేదు. అందుబాటులో ఉన్న అతివలను అనుభవించకుండా విడిచిందీ లేదు. వైవిధ్యంలేని జీవితం నిస్సారమని అతనికి బాగా తెలుసు. అందుకని ఒకసారి అనుభవించిన అతివను మళ్ళీ పిలిపించే వాడు కాదు. ఆమె ఎంత రసాస్వాది ఐనా మదనమోహన్ కాముక దృష్టిలో ఆమె జీవిత పరిమితి ఒక్క రాత్రి మాత్రమే! అనంగరంగంలో అతని తోడి అనుభూతిని పొందిన అంగన అంగాంగాలూ కదలిపోవటంతో అతని పేరే ఆమెకు సింహస్వప్నంగా మారుతుంది. ఎంత మదవతి ఐకూడా, ఏ విధంగానైనా సరే అతన్ని రతికేళిలో ఓడించాలని ఎంత పట్టుదలతో పోరాడీ, చేతులెత్తి నమస్కరించి – చావు తప్పి, కన్నులొట్ట బోయి ప్రాణాలతో బైటపడటమే అదృష్టమని భావించిన సంఘటనలు అనేకం.

'పుష్పకం' అని పేరు పడిన పడతులు జతగావొచ్చి కూడా తెల్లారేప్పటికి క్షతగాత్రలై, ఉప్పెనలాటి మదనమోహన్ మదాన్ని ఎదురాడి నిలవటం అసంభవమనే నిశ్చితాభిప్రాయాన్ని పొందటం పరిపాటయింది.

తమ బిగి, వెచ్చని కౌగిలిలో ఎంత కఠినుడైన పురుషుణ్ణయినా అగ్నిశిఖలు ఆవరించిన నవనీతం చేయగల నెరజాణ కూడా – మదనమోహన్ ఉక్కు కౌగిలిలో ఇమిడి నజ్జునజ్జు కావటం ఒక సాధారణ విషయమైంది.

మదనమోహన్ మనిషి కాదనీ, 'మర' అనీ అతనిచేత అనుభవించబడిన మగువ లందరి ఏకాభిప్రాయం. ఐతే ఆ 'మర' 'అశ్వశక్తి' ఎంతో, లేక విద్యుత్ప్రసారపు వోల్టేజి ఎంతో ఎవరూ నిర్ధారణగా తేల్చలేకపోయారు.

ఇంత 'మదపిచ్చి' ఉన్న మదనమోహన్, జీవితంలో పెళ్ళి చేసుకునే పిచ్చి ఊహకు చోటివ్వలేదు. ప్రపంచమంతా గాలించి సుందరాంగులకు గర్వభంగం చేయటమే లక్ష్యంగా పెట్టుకున్న వాడికి కాలు ఒకచోట నిలుస్తుందా?

పదేళ్ళలో ఆసేతుహిమాచలం వరకూ పేరుపడిన విలాసవతులందర్నీ అతను అనుభవించి పారేశాడు! సాధారణ విలాస పురుషునికన్న సగం కాలంలోనే (ఒకో రాత్రికి ఇద్దరేసి స్త్రీల చొప్పున వాడగలడు కనుక!) ఇండియా 'ఔట్ ఆఫ్ స్టాక్' అనవలసి వొచ్చింది.

తనలోని కామస్రవంతి అంతు లేనిదా అనే సందేహం మదనమోహన్‌ను కూడా వేధిస్తూండేది. తన శరీరంలో ఏ యే గ్రంథులు విధి విరామం లేకుండా పని చేస్తున్నవో తెలియదు. పిడివలె బిగిసిన కామం పీడవలె తనను వెన్నాడుతోంది. విసుగుండదు; ఒక్కో సమయంలో తన యీ విచిత్ర వికారాన్ని గూర్చిన విచారం కలుగుతూండేది. ఇది ఎప్పటికి పరిపూర్ణమైన తృప్తిని పొంది, చల్లారి తనకు విముక్తి లభిస్తుందో అతనికి అర్థమవటంలేదు. త్వరగా నామరూపాలు లేకుండా యీ కామాన్ని నాశనం చేయాలనే నిశ్చయమైతే ఉన్నది. దానికోసమే ఒక్క రాత్రికూడా వృథా పోనీకుండా తలపడ్డాడు. ఐనప్పటికీ సత్ఫలితం చూపు మేర దూరంలో కానరావటం లేదు.

తల్లిదండ్రుల మరణంతో మదనమోహన్ సంసారపు బంధనాలు పటాపంచలైనవి. స్వదేశంలోని అనుభవాలు పూర్తికాగా పరదేశాలకు అతను పయనమయ్యాడు.

విలాసాలకు ప్రసిద్ధికెక్కిన పట్టణాలన్నీ దర్శించాడు. దేశదేశాల్లోని మదవతుల్నీ చవిచూశాడు. ఎంత గాలించినా తనను భరించగల ఒకే స్త్రీ ఎన్నడూ ఎదురవలేదు. అకారాది సూచిక ప్రకారం అతను అనుభవించిన స్త్రీల పట్టిక తయారుచేసే చరిత్రకారునికి, ఒక్క ఆడపేరూ బీరుపోదు. జాతి, కుల, మత విచక్షణ లేకుండా, వ్యయప్రయాసల ప్రస్తావన లేకుండా చిత్రవిచిత్ర గతుల్లో లెక్కపెట్టలేనంత మంది మగువలనుంచి అనుభవాన్ని పిండుకొన్న పేరుప్రఖ్యాతులు అతనికే దక్కినవి.

పాతికేళ్ళపాటు ప్రపంచమంతా తిరిగి మదనమోహన్ ఇండియాకు వొచ్చాడు. వాడినకొద్దీ, 'వేడి' 'వాడి' తరగవలసిన అతని కామవాంఛలు - పూర్వం వలెనే తీవ్రరూపాన ఉన్నవి. ఆకురాయి మీద అరిగే ఉక్కుముక్క కొంత పరిమాణాన్ని కోల్పోయినప్పటికీ, అరిగిన కొద్దీ పదును తేలుతున్న విధంగా పరిణమించి దతని కామప్రకోపం! ఇది తనను ఎన్నటికీ వొదలదనే భయం పట్టుకున్న దతనికి. దీన్నుంచి విముక్తి పొందేందుకు కామాన్ని మొదలంటా అనుభవించట మొక్కటే మార్గమనీ తెలుసు నతనికి.

ఇప్పటికి తరువాతి తరాలనుంచి వొచ్చిన తరుణులు ఇండియాలో సిద్ధంగా ఉన్నారు. మార్పులేని కామానుభూతుల్ని తిరిగి సాగించా డతను. 'మీ పేరు విన్నానండీ!' అని ఎవరైనా అమ్మాయి అంటే 'నువ్వేమిటీ? మీ అమ్మ, అమ్మమ్మా కూడా నా పేరు విని ఉండాలి!' అనగలిగేవాడు మదనమోహన్. అతను ఇండియాలో ఇప్పుడు అనుభవించేది మూడోతరంలోని వాళ్ళను!

రకరకాల స్త్రీలూ- 15 సంవత్సరాలనుంచీ 51 సంవత్సరాల వయసు వరకూ ఉన్న అందగత్తె లెంతోమందిని చవిచూశాడతను. ఎంత అనుభవజ్ఞురాలు కూడా ఆ ధాటికి ఓర్వలేని అశక్తతనే రుజూ చేస్తూండేది.

'గుమ్మడికాయ ఎంతుంటేనేం- కత్తిపీటకు లోకువే కదా!' అనీ, 'మిరపకాయ ఎంత చిన్నదైతేనేం- కారం తగ్గుతుందా!' అనీ, ఆ మదవతులు కుంటి గుడ్డి సమాధానాలు చెప్పుకునేవారు.

అనేకమంది సంసార స్త్రీలు కూడా మదనమోహన్ అందచందాలకూ, రసికత్వానికీ, డబ్బుకూ ఆశపడి అతనికి లొంగారు. 'అపర కృష్ణావతారం!' అనే బిరుదుకు ఎవరికైనా అర్హత ఉంటే- అది ఒక్క మదనమోహన్‌కే ఉన్నదనేందుకు ఎలాటి ఆక్షేపణా ఉండదు.

ఈ విధంగా మరో పదేళ్ళు ఇండియాలో విలాస జీవితం గడిపాడతను. శరీరంలోని పటుత్వం జారుతోంది. శృంగారపు టాలోచనలూ, కుతూహలం మాత్రం తగ్గటంలేదు. ఆస్తిలో చాలాభాగం హరించుకొని పోగా, అతని ఆస్తిలో ఇక మిగిలిందంతా రొఖ్కం రూపాన ఐదు లక్షల రూపాయిలుగా మారింది.

ఇప్పుడతని వయసు 60 సంవత్సరాలు. వయస్సును బట్టి షష్ఠి పూర్తి ఐంది; అనుభవాన్ని బట్టి గోల్డెన్ జూబిలీదాకా దేకింది. ఇంకెప్పటికి తనకు విముక్తి?

ఈ వ్యసనం తనను నీడవలె వెన్నాడుతోంది. తనకు విసుగనిపించినా, శరీరంలోని 'మదపు ఊట' తనను నిలవనీటం లేదు. హిందూ ధర్మశాస్త్ర ప్రకారం తనేమౌతాడు? మృత్యువేమో తప్పదు. తాను చేసిన పుణ్య కార్యా లేమీ లేవు కనుక తనకు నరకం తప్పదేమో? ఇంకా యీ జీవిత పరిమితి ఎంత ఉన్నదో తెలియదు. ఆ ఉన్నంతలోనే సత్కార్యాలు ఏమైనా చేస్తే తనకు యీ కామాంధతనుంచి విముక్తీ, జీవితంనుంచి ముక్తీ లభిస్తవేమో?

దేవుడే స్వయంగా వొచ్చి చెప్పినా వినేరకం కాదు మదనమోహన్. దేవుడు తన మాటలు అతని చెవి కెక్కించాలంటే బ్రోకర్ అవతారం దాల్చక తప్పదు. అలాటి మొండివాడికి ఎప్పుడైతే మృత్యువు – దాని తదనంతర సమస్యలు మనస్సులో మెదిలినవో స్వల్ప వ్యవధిలోనే అనేక నిర్ణయాలు చేసుకో గలిగాడు.

తన చేతుల్లో ఉన్న అవకాశాలూ, అధికారాలూ పోతేనే తప్ప, తాను అశక్తుడై, తన మనస్సు కూడా చెప్పుకింది తేలువలె పడి ఉండదు. అందుకని అతను తన దగ్గిరున్న ఐదులక్షల రూపాయిల్నీ పండరీపురంలోని పాండురంగనికి ఇచ్చేశాడు.

ఇప్పుడు సాధారణ మానవుడుగా మదనమోహన్ జీవిత శేషాన్ని పాండురంగస్వామి పాదాలముందే గడిపేందుకు నిశ్చయించుకున్నాడు. 'రాగి' ఐ సర్వమూ అనుభవించాక, 'విరాగి' కావటానికి ఒక మార్గమూ, సులభసాధ్యమూ అనేదాన్ని అమలు జరిపాడు.

సర్వసంగ పరిత్యాగియై ఆశ్రమంలో ఉంటూ, ఆశ్రమ వాసులవలె నిరాడంబరంగానూ, సుఖాలు మరిగిన శరీరానికి ఎంతో కష్టసాధ్యంగానూ ఉండే

జీవితాన్ని క్రమంగా అలవరుచుకున్నాడు. భగ ధ్యాని భగవ ధ్యాని అయ్యాడు. యీ పవిత్ర జీవిత కారణంగా తనకు సద్గతు లుంటవనే ఊహ, స్వర్గ సౌఖ్యాలకు తాను నోచుకుంటున్నాననే ప్రోత్సాహంతో అతను రోజులు గడపసాగాడు.

పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక తప్పదు కదా! ఆ విధంగా పదేళ్ళపాటు పండరీపురంలో పాండురంగని పాదారవిందాలు సేవిస్తూ, పరమ పవిత్రంగా గడిపి, భగవన్నామ స్మరణలోనే ఒకనాడు మదనమోహన్ మరణించాడు.

## 2

మదనమోహన్ మరో నాలుగు రోజులకు మరణిస్తా డనగా స్వర్గంలో కోలాహలంగా మొదలై, హాలాహలంగా మారినవి పరిస్థితులు.

మదనమోహన్‌కు స్వర్గార్హత ఉన్నదా? లేక నరకానికి పంపాలా అనే సమస్య అక్కడి పార్లమెంట్‌లో తీవ్రంగా చర్చించబడింది.

మహారసికుడైన మదనమోహన్ దగ్గిర అనుభవాలను భూలోకంలోని అందాలరాసు లనేకమంది చవి చూశారు; అతను జీవితంలోని తుది దశాబ్దమంతా పాండురంగ భక్తాగ్రేసరుడుగా గడిపిన కారణంగా స్వర్గానికే వొస్తాడనీ, అతని పొందులో ఆనందాన్ని సురకాంతలైన తాముకూడా అనుభవించగలుగుతామనీ, ఆ మాటకొస్తే, ఇద్దరేసి స్త్రీలను ఏకరాత్రి అనుభవానికి అంకితం చేసిన ఇతని రసికత్వాన్ని తాము ఒక్కరొక్కరుగానే ఆస్వాదించవొచ్చనీ, తమతోడి అనుభూతిలో ఆ నవమన్మథుణ్ణి ఓడించి తమ రతి చాతుర్యాన్ని ప్రదర్శించగలమనీ ఉవ్విళ్లూరారు– రంభా, ఊర్వశీ, తిలోత్తమా ఇత్యాది.

కాని స్వర్గ నరకాల్లో యీ మదనమోహన్‌కు ఏది ఇవ్వాలనే ప్రశ్న పార్లమెంట్‌లో తలెత్తిందనే మాట వినేప్పటికి ఆ దివ్యాంగనల ఆశయాలకు పెద్ద దెబ్బ తగిలింది. ఏ విధంగానైనా సరే మదనమోహన్‌కు స్వర్గప్రాప్తి కలిగించేందుకు వారు తమ పలుకుబడులను తీవ్రంగా ప్రయోగించారు.

తమ పొందుకై ఉవ్విళ్ళూరే జడధారులను రంజింపజేసి మదనమోహన్ స్వర్గ ప్రవేశానికి అనుకూలంగా ఉండే తీవ్రమైన వాదనలను పార్లమెంట్‌లో ప్రయోగించేటట్లు చేశారు. ఎన్నడూ కని విని ఎరుగనంత అలజడి పార్లమెంటులో చెలరేగింది. అనేక హేతువాదాలు ప్రయోగించబడినవి.

“ఇదొక సమస్యా? అలనాడు అజామీళుడు ఎన్నో పాపాలు చేసి అవసాన దశలో ‘నారాయణా!’ అన్నంత మాత్రాన స్వర్గానికి వొచ్చాడే! యీ మదనమోహన్ పదేళ్ళపాటు కఠిన తపశ్చర్యచేసి పాండురంగని పాదాలముందు చావబోతుంటే అతనికి స్వర్గంగాక, నరకం ఎలా ఇస్తారు?” అన్నాడో జడధారి.

"మదనమోహన్‌కే నరకం ఇస్తే, ఇక భగవంతునిమీది నమ్మకం భూలోకంలో అంతరించినట్లే లెక్క! యీ కథ విన్నవారెవరికైనా 'భక్తి' 'ముక్తి' నిస్తుందనే నమ్మకం కుదరాలంటే మదనమోహన్‌కు స్వర్గమే ఇవ్వవలసి ఉంటుంది!" అన్నాడు మరో జడధారి.

"సకల పాపహరణమైన పాండురంగ సేవాతత్పరతలో పరమ పవిత్రుడుగా రూపొందిన మదనమోహన్‌కు నరకం ఎలా ఇస్తారు?" అన్నదో నెరిసిన గడ్డం ఛాలెంజ్ చేస్తూ.

ఎటు చూసినా అత్యధికులు మదనమోహన్ పక్షమే వహించినట్లు తెలుస్తూనే ఉన్నది. మిగిలిన వారైనా ప్రతికూలంగా మాట్లాడకుండా మౌనం వహించారు!

ఇంతకాలంగా పురాణ పురుషులైన అనేకమంది జడధారులకు రతి సౌఖ్యాన్నిచ్చే దేవాంగనలకు సహజంగానే ఆ మునులంటే ద్వేషం జనించింది. కంబళీల్లాంటి, గుండుసూదుల్లాంటి వాళ్ళ గడ్డాలు కుసుమ కోమలమైన తమ మొహాలకు గుచ్చుకుంటూ, ఎంతో చిరాకుగా, బాధాకరంగా ఉన్నా, తప్పనిసరై విధి నిర్వహణ కారణంగా భరిస్తూనే ఉన్నారు. అధునాతన ప్రపంచంలో అంత పుణ్యాత్ములు ఎటూ ఉండటంలేదు కనుక, కొత్తవాళ్ళెవరూ స్వర్గానికి రావటం లేదు. పురుషుల వాంఛల వైవిధ్యం వలెనే ఎంత సురాంగనలైనా తమకు మాత్రం వింత కోర్కెలుండవా? తీరా యీ మదనమోహనైనా రూల్స్ ప్రకారమే స్వర్గ ప్రవేశం చేస్తే, తమ కా దివ్యానుభూతులు లభ్యమౌతవి కదానని వారు ఆశపడితే– ఇదొక వాగ్వాదంగా పరిణమించింది. ఏమౌతుందోనని ఆ వారకాంతలు ఎంతో ఆతృతతో వేచి ఉన్నారు.

ఇంద్రుడికి ఎటూ పాలుపోవటంలేదు. యీ మునులు గ్రహించటంలేదు కాని, ఆ మదనమోహన్ స్వర్గానికే వొస్తే చాలా విషమ పరిస్థితులు ఏర్పడుతవి. కొత్త సమస్య లనేకం తలెత్తుతవి. ఐతే రూల్స్ ప్రకారం అతనికి స్వర్గం తప్పదు. ఎలాగైనా నరకానికి తోసేసే ఉపాయాన్ని గూర్చి ఇంద్రుడు ఆలోచన చేశాడు.

నిర్ణయం తీసుకోవాల్సిన రోజున ఇంద్రుడు 'డి.ఐ.ఆర్.' (డిఫెన్స్ ఆఫ్ ఇంద్రాస్ రాజ్) అనే కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టాడు. దీని ప్రకారం పరిపాలనకు ఆటంకాలు ఏర్పడుతవనే అనుమానం కలిగిన వ్యక్తులమీద యీ డి.ఐ.ఆర్ ప్రయోగించబడుతుంది. 'ఎలాటి ఆటంకాలు?' అనే విషయం రాజ్యక్షేమ దృష్ట్యా వివరించబడవలసిన అవసరం లేదు!

ఇంద్రుడే స్వయంగా ఇదంతా వాగాక జడధారులు గడ్డాల్ని సవరించుకోవటం మినహా ఏమీ చేయలేక, గంగిరెద్దులల్లే తలూపారు.

ఈ డి.ఐ.ఆర్. ను ప్రయోగించటం ద్వారా మదనమోహన్‌కు స్వర్గం రాలేదు సరికదా – నరకమే ప్రాప్తించింది.

దేవాంగనలు నిరాశాపూరితులయ్యారు.

❋ ❋ ❋

కథాంతాన భేతాళుడిలా అన్నాడు:

"రాజా! యీ కథలో నాకు అనేక సందేహాలు కలుగుతూన్నవి. పరమపాపులు కూడా కొద్దికాలం దైవభక్తులైన కారణాన స్వర్గానికే వెళ్లారు కదా! అలాటిది యీ మదనమోహన్ చేసిన పాపాలను అతని భక్తి క్షాళితం చేయలేక పోయిందనే సాహసం ఉండబోదు.

"కేవలం యీ మదనమోహన్ స్వర్గానికి రాకుండా అడ్డుకొనే నిమిత్తం ఇంద్రుడు డి.ఐ.ఆర్.ను తయారుచేసి ప్రయోగించాడు. నిజానికి అంత తీవ్రమైన చట్టాన్ని అమలు జరపాలా? 'రాజ్య క్షేమ దృష్ట్యా' అన్నదాంట్లో నిజం ఎంత ఉన్నది? మదనమోహన్ రాకతో స్వర్గమే అల్లకల్లోమౌతుందని ఇంద్రుడు ఎందుకు నమ్మాడు? అలాటి అవకాశాలకు సావకాశ మున్నదా? ఇంద్రుని ప్రవర్తన సమర్థించదగిందా?

"ఈ సమస్యలకు జవాబు తెలిసి ఉండీ చెప్పక పోయావో నీ తల వేయి ముక్కలవుతుంది!"

❋ ❋ ❋

విక్రమార్కుడు ఈ విధంగా జవాబు చెప్పాడు:

"జడధారులు పరకాంతల వలపు వలల్లో చిక్కుకొని, వారి మాటల్నే చిలుకపలుకులల్లే పార్లమెంటులో వాగారే కాని, దూరం ఆలోచించలేదు. మదనమోహన్ చేసిన పాపాలు అతని భక్తి తత్పరతలో క్షాళనం అవటమే గాక, స్వర్గం జేరేందుకు సరిపడేపాటి పుణ్యం కూడా అతని ఎక్కవుంటులో జమ ఉండనే ఉంటుంది. స్వర్గ ప్రవేశార్హత కూడా అతనికి ఉన్నది. ప్రస్తుతం అమల్లో వున్న రూల్స్ ప్రకారం అతనికి స్వర్గప్రాప్తిని ఇంద్రుడు కాదు కదా- వాడి బాబాయ్ కూడా అడ్డుకోలేడు.

అందుకనే ఇంద్రుడు డి.ఐ.ఆర్. ప్రయోగించవలసిన అవసరం ఏర్పడింది. మదనమోహన్ రాకతో స్వర్గంలోని దైనందిన జీవితం అల్లకల్లోల మౌతుందనే విషయం ఇంద్రుడు దీర్ఘదృష్టికి అతీత మవలేదు. అమల్లో వున్న చట్టాలమీద చర్చించి గెలవలేమని ఇంద్రునికీ తెలుసు. అందుకనే ఎమర్జెన్సీ వ్యవహారంగా డి.ఐ.ఆర్ ను ప్రయోగించాడు.

మదనమోహన్‌కు స్వర్గ ప్రవేశమిస్తే ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు అతని జీవితాన్ని పరిశీలిస్తే చాలు: అతనిలోని కామ స్రవంతి అమరం! ఒక్కో రాత్రికి ఇద్దరేసి స్త్రీలను సైతం తుక్కుతుక్కుగా చేయగల అతని పురుషత్వం - ఒక రోజు కాదు, రెండురోజులు కాదు- నలభై ఐదు సంవత్సరాలు రుజూ అవనే ఐంది! అతను

కనుక స్వర్గానికి వొచ్చి పడ్డాడో దివ్యాంగనలను సైతం జతలు జతలుగా అనుభవిస్తాడు! ఆ కాంతలుకూడా అతని పొందుకు ఉవ్విళ్ళూరుతున్న కారణాన వొంతుల వారీగా అతన్నే అందరూ పంచుకుంటారు. అప్పుడు మిగతావాళ్ళకు – ముఖ్యంగా పీచుగడ్డాల వారికీ, టూత్ బ్రష్ గడ్డాల వారికీ వారకాంతల పొందు దక్కదు!

మదపు టేనుగును గాజు సామానునుంచిన గదిలోకి వదిలిన ట్లవుతుంది! భూలోకంలోని సుందరాంగుల్నే, నిస్సారంగా ఉపయోగించగల సామర్థ్యమున్న మదనమోహన్– అపురూప లావణ్యవతులూ, దివ్యాంగనలైన సురకాంతలు లభ్యమయ్యే పక్షంలో అతని పురుషత్వం ఇంకెంత విజృంభిస్తుందో ఊహకే అతీతం! అతని ప్రవేశంతో అంతకుముందు స్వర్గ వాసులుగా వున్నవారంతా నిరాశాపూరితు లవుతారు కదా!

అప్పుడు వారంతా గోడు గోడున ఏడుస్తూ ఇంద్రునితో మొరపెట్టుకుంటే, ఇంద్రుడు మాత్రం కొత్త కాంతల్ని వీళ్ళందరికీ ఎక్కడ సరఫరా చేయగలడు? లోపల రతి సౌఖ్యాన్ని అనుభవించే యోగ్యత వుండీ, అనుభవిస్తున్నవాణ్ణి కాదని బైటికి లాగగలడా? మహా తపస్వులైన మునులందరూ గడ్డాలు పీక్కుంటూ కూర్చుంటే ఆ విషాద దృశ్యాన్ని ఎంత సేపు చూసి భరించగలడు? 'రాజ్యక్షేమం' అనే పదంలో ఇంత ముందుచూపు వుంచుకునే ఇంద్రుడు డి.ఐ.ఆర్. ప్రయోగించాడు; అది సమంజసం కూడాను.

మదనమోహన్‌కు స్వర్గమే ఇస్తే, ఇక ప్రతి విలాస పురుషుడూ తుది ఘడియల్లో హరినామస్మరణ చేసి స్వర్గ ప్రవేశార్హతను సంపాయిస్తాడు. తుకిడీలు తుకిడీలుగా వీళ్ళంతా స్వర్గానికి జేరుతే ఇక్కడి వారకాంతా పటాలాలు విశేషంగా పెరగవలసి వుంటుంది. ఇదంతా ఎంత గందరగోళమో ఆలోచించే ఇంద్రుడు సరైన చిటికా ప్రయోగించాడు.

అదీగాక, భూలోకంలో అకారాది సూచికలో ఏ పేరూ బీరు పోకుండా అనుభవించినవాడికి– మళ్ళీ స్వర్గంలోని రంభా, ఊర్వసుల సంభోగం కూడా యిస్తే వ్యక్తిపరంగా ఇంత అనుభవం ఎంత అసందర్భమూ, అన్యాయమూ అవగలదో ఇంద్రుడు ఆలోచన చేసి నిర్ణయించాడు. డ్రెమెటిక్ సోషలిజమ్‌లో ఇలాటిది ఇమడదు! All this and the heaven too-Impossible!"

విక్రమార్కుని జవాబు వినగానే వీర్య భేతాళుడు తుర్రున పారిపోయి మర్రిచెట్టెక్కాడు.

– ఫిబ్రవరి, *1967*